

నేడు జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సు

తొలుత భారీ ర్యాలీ

ఎంఎల్‌సిలు, వివిధ పార్టీల ప్రముఖులు హాజరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా సమగ్రాభివృద్ధిపై మంగళవారం ఆర్ఆర్‌పేటలో కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో సదస్సు జరగనుంది. ముందుగా ఉదయం పది గంటలకు రెడ్‌షర్ట్ వాలంటీర్ల మార్చ్, ప్రదర్శన కొనసాగనుంది. ప్రభుత్వాసుపత్రి మెయిన్ గేటు ముందు నుంచి ఆర్ఆర్‌పేట మీదుగా కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపం వరకూ ర్యాలీ జరగనుంది. అనంతరం 11 గంటలకు కల్యాణమండపంలో సదస్సు కొనసాగనుంది. ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్రనాయకులు మంతెన సీతారాం, ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొనున్నారు.

సాగు పెరిగే.. ధర తగ్గే..!

ఆయిల్‌పామ్ రైతుల గగ్గోలు

ఈ ఏడాది 20 వేల ఎకరాల్లో పెరిగిన సాగు

క్వింటాల్‌కు రూ.23 వేల నుంచి రూ.12,400కు ధర పతనం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు

కనీసం రూ.18 వేలు ధర ఉండాలని డిమాండ్



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆయిల్‌పామ్ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటకు ధర బాగుందని, రైతులు కొత్తగా తోటలు వేస్తుండగా, ఈ ఏడాది ధరమాత్రం భారీగా పడిపోయింది. దీంతో ఆయిల్‌పామ్ రైతులకు ఏం చేయాలో తెలీని పరిస్థితి నెలకొంది. ఎన్నో ఆశలతో ఆయిల్‌పామ్ తోటలు వేస్తున్న రైతులు లోలోన తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు లక్షా పదివేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నారు. పామాయిల్ సాగులో రాష్ట్రంలో ఏలూరు జిల్లా ప్రథమస్థానంలో ఉంది. రెండేళ్ల క్రితం ఆయిల్‌పామ్ పంటకు సరైన ధర లేకపోవడంతో రైతులు తోటలను తొలగిస్తూ మొక్కజొన్న సాగువైపు మళ్లారు. కామవరపుకోట, ద్వారకాతిరుమల వంటి అనేక మండలాల్లో రైతులు తోటలు తొలగించారు. గతేడాది ఆకస్మికంగా టన్ను పామాయిల్ ధర రూ.23 వేలు పలికింది. దీంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. పామాయిల్ సాగుపై రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. పంటకు మంచి ధర పలకడంతో అంతకు ముందు ఎకరాకు రూ.50 వేలు, రూ.60వేలు ఉండే కౌలుకాస్తా రూ.లక్ష దాటేసింది. అంతేకాకుండా కొత్తగా తోటలు వేయడం సైతం రైతులు ప్రారంభించారు. దీంతో 2023లో కొత్తగా 20,215 ఎకరాల్లో పామాయిల్ సాగు పెరిగింది. పామాయిల్ రైతులు ఎన్నో ఆశలతో ముందుకు వెళుతుండగా ఈ ఏడాది అనూహ్యంగా పామాయిల్ ధర భారీగా పడిపోయింది. టన్ను ధర రూ.12,300 వరకూ మాత్రమే పలికింది. ఒక్కసారిగా టన్నుకు రూ.పదివేలకుపైగా ధర పడిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పామాయిల్ ధర పతనంతో ఈ ఏడాది రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పెట్టుబడులు కూడా రాని పరిస్థితి

ఆయిల్‌పామ్ సాగులో ఎకరాకు ఎరువులు, కోత ఖర్చులు అన్నీ కలిపి రూ.80వేల వరకూ పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు పది టన్నులకుపైగా దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది తెల్లదోమసోకి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఎకరాకు ఏడేనిమిది టన్నుల దిగుబడి రావడమే గగనంగా మారింది. ఎకరం పామాయిల్ తోటకు పెట్టుబడి, కౌలు కలిపితే రూ.1.60 లక్షలు వరకూ అవుతోంది. టన్నుకు రూ.12,300 ధర చొప్పున లెక్కిస్తే ఏడు టన్నులకు రూ.86 వేలు మాత్రమే ఆదాయం వస్తోంది. దీంతో కౌలురైతులు ఎకరాకు రూ.70 వేల వరకూ నష్టపోయారు. పామాయిల్ సాగుచేసే రైతులు తక్కువగా లెక్కించినా ఐదెకరాల వరకూ సాగుచేస్తారు. దీంతో ఒక్కో రైతు తక్కువగా లెక్కించినా రూ.3.50 లక్షల వరకూ నష్టపోయిన పరిస్థితి నెలకొంది. దీంతో కౌలురైతులు అప్పులుపాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పామాయిల్ రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రనిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. టన్నుకు కనీసం రూ.18 వేలు ధర ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పామాయిల్ రైతులు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా కొత్త పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీని సైతం నెరవేర్చలేదు. పామాయిల్ సాగు పెంపుచేసినట్లు ప్రభుత్వం గొప్పగా చెబుతోంది. అదేసమయంలో ధర పతనంపై కూడా మాట్లాడితే బాగుంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఎస్మా దుర్మార్గం

రాజకీయ పక్షాలు, కార్మిక, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అలుపెరగని పోరాటం చేస్తుంటే వారిపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని రాజకీయ పక్షాలు, కార్మిక, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ముక్తకంఠంతో ఖండించింది. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా శిబిరంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన తెలుగుదేశం నాయకులు బోడే వెంకటరత్నం, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జనసేన నాయకులు ఎస్‌వి. దుర్గాప్రసాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, బిఎస్‌పి నాయకులు నేతల రమేష్‌బాబు మాట్లాడుతూ శాంతియుతంగా 28 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం అప్రజాస్వామికమని విమర్శించారు. వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తుంటే చర్చలు జరిపి పరిష్కరించకుండా నిర్బంధాన్ని ప్రయోగించడం జగన్ ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన సమ్మెకు రాష్ట్రంలో ఉన్న కోట్లాది మంది ప్రజలు అండగా ఉన్నారని, ఎస్మాకు బెదరాల్సిన అవసరం లేదని, విజయం సాధించే వరకూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎపి ఎన్‌జిఒ సంఘం నగర కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఎన్‌జిఒ సంఘం ఎల్లప్పుడూ మద్దతు తెలుపుతుందని ప్రకటించారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు బద్ద వెంకటరావు, కె.బుచ్చిబాబు, కె.కృష్ణమాచార్యులు, డిఎన్‌విడి.ప్రసాద్, ఎస్.నాగరాజు, పి.భారతి, ప్రజా సంఘాల నాయకులు పివి.రామకృష్ణ, ఎ.ఫ్రాన్సిస్, కాకి నాని, వి.శైలజ, పి.ఆదిశేషు, రవి కిషోర్, ఎర్ర రాంబాబు, ఉష ప్రసంగించారు.

మూడో రోజు నిరాహార దీక్షల ప్రారంభం

24 గంటల రిలే నిరాహార దీక్షలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలో ఏలూరు, పెదవేగి, దెందులూరు, కైకలూరు, కామవరపుకోట, పోలవరం, వేలేరుపాడు మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.



24 గంటల రిలే నిరాహార దీక్షలో అంగన్వాడీలు

కౌలురైతులకు రబీపంట రుణాలివ్వాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

కౌలు రైతులకు రబీసాగుకు వడ్డీలేని పంట రుణాలివ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం కైకరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం, కౌలు రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకర్లు కౌలురైతులకు పంట రుణాలివ్వకుండా మొండి చేయిచూపడం తగదన్నారు. జిల్లా రుణ ప్రణాళికలో మూడు శాతానికి మించి పంట రుణాలు కౌలు రైతులకు అందడం లేదన్నారు. గడిచిన ఖరీఫ్‌లో 32 వేల మంది కౌలు రైతులకు రూ.142 కోట్లు పంట రుణాలుగా ఇచ్చినట్లు బ్యాంకర్లు కాకి లెక్కలు చెబుతున్నా ఆచరణలో కౌలురైతులకు దామాషా ప్రకారం రుణాలు మంజూరు కావడం లేదన్నారు. జిల్లాలో 60 శాతం భూముల సాగు చేస్తున్న కౌలు రైతులకు జిల్లా రుణ ప్రణాళిక నుండి కౌలు రైతుల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు.

నష్టపోతున్న ఆక్వా రైతులను ఆదుకోవాలి

కనీస ధరలు రాక నష్టపోతున్న ఆక్వా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చేపలు, రొయ్యల రైతులు నష్టాలు ఊబిలో కూరుకుపోయి అప్పులు పాలై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలురైతు సంఘం జిల్లా కన్వీనర్ అప్పారావు, జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

10న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఈనెల 19న విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని 'సామాజిక న్యాయ మహాశిల్పం' పేరుతో సిఎం జగన్ ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఈనెల పదో తేదీన ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులకు, యువతకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు. జన భాగీధారి-ప్రజల భాగస్వామ్యం కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలో విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఏలూరు నగర కార్పొరేషన్ ద్వారా ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. నగరంలోని విద్యార్థులు, యువతీ యువకులు ఈ క్రింది అంశాలపై మాట్లాడేందుకు సమాయత్తం కావాలని కోరారు. ఆసక్తి గల వారు తమ పేర్లను ప్రాజెక్ట్ ఆఫీసర్ అండ్ మేనేజర్ పి.కృష్ణమూర్తికి ఈనెల పదో తేదీ ఉదయం పది గంటల్లోపు అందజేయాలన్నారు. ఇంటర్ ఆపై విద్యార్థులకు ఆర్థికవేత్తగా అంబేద్కర్, విద్యార్థినులకు సామాజిక ఉద్యమకారునిగా అంబేద్కర్, యువకులకు అంబేద్కర్-కుల నిర్మూలన, యువతులకు అంబేద్కర్, రాజ్యాంగ నిర్మాణం అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. అదే విధంగా ఎనిమిదో తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఈనెల పదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులకు అంబేద్కర్ ఆలోచనలు, విద్యార్థినులకు-అంబేద్కర్ రచనలు వంటి ముఖ్యాంశాలపై పోటీలు నిర్వహించబడతాయన్నారు.



సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

స్పందన అర్జీదారులను సంతృప్తిపరచాలి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జగనన్నకు చెబుదాం - స్పందన అర్జీదారులు సంతృప్తి చెందేస్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్ స్వీకరించారు. జెసి బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖజావలి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం 374 అర్జీలు అందాయన్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం - స్పందనలో స్వీకరించిన అర్జీల పరిష్కారంపై తీసుకున్న చర్యలు అర్జీదారుల్లో సంతృప్తిస్థాయి పెరిగేలా ఉండాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతివ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఈనెల పదో తేదీ నుంచి మండలస్థాయిలో ఆడుదాం-ఆంధ్రా పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భారీప్రదర్శన

14వ రోజుకు సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్మికులు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకూ భారీప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఏలూరు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలకు చెందిన వందలాది మంది మున్సిపల్ కార్మికులు ఏలూరు నగర పాలకసంస్థ కార్యాలయానికి ఉదయమే చేరుకున్నారు. అక్కడి నుండి కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన మున్సిపల్ ఆఫీసు వద్ద ప్రారంభమై కత్రవంతెన, వసంత మహల్ సెంటర్, జ్యూట్‌మిల్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి, ఫైర్‌స్టేషన్ సెంటర్ జిల్లాపరిషత్ గెస్ట్ హౌస్ మీదుగా కలెక్టరేట్ వరకూ సాగింది. అనంతరం ధర్నా చేపట్టారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనమివ్వాలని, క్లాప్ ఆటోల డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, 11వ పిఆర్‌సికి అనుగుణంగా కనీస వేతన రూ.26 వేలు పెంచాలని ప్రభుత్వం మొండివైఖరి వీడాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పని చేశారని కానీ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తుందని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు జగనన్న హామీల అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. క్లాప్ ఆటోల డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనం ఇవ్వాలని కాంట్రాక్టర్లను రద్దు చేసి మున్సిపాలిటీ నేరుగా జీతాలు చెల్లించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి బి.బాలరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరాజు, జాన్‌బాబు, లావేటి కృష్ణ, రమణ, నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.రవికుమార్, నాయకులు పివి.నరసింహారావు, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు జె.గోపి మద్దతు తెలిపారు. బంగారు వెంకటేశ్వరరావు, గణేష్, రాజు, బండిరాజు, నారాయణ, జార్జి, భాగ్యలక్ష్మి, భవాని, దుర్గమ్మ, పద్మ, గోపి నాయకత్వం వహించారు.



ఎఐటియుసి ఆధ్వర్యాన..

ఎఐటియుసి నాయకత్వంలో జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె సోమవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఎఐటియుసి సమ్మె శిబిరంలో నాయకులు, కార్మికులు నల్ల దుస్తులు ధరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని ప్రజానాట్య మండలి ఏలూరు జిల్లా కన్వీనర్ బల్ల కనకదుర్గారావు, జిల్లా నాయకులు తమ్మ విశ్వేశ్వరరావు సందర్శించి మద్దతును తెలిపారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బజంత్రి శ్రీనివాసరావు, ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ శనివారం రాష్ట్ర మంత్రులు డిఎంఎ అధికారులతో జరిగిన చర్చల సారాంశం తెలిపారు. రాష్ట్ర నాయకత్వం సమ్మెను నిలుపుదల చేయాలని చెప్పే వరకూ సమ్మెను కొనసాగించాలని వారు కోరారు. ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఎఐటియుసి జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు పోలా భాస్కర్‌రావు, గేదెల నాగేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.వంశీకిరణ్, మరియదాసు, వై.చిన్నమ్మ పాల్గొన్నారు.

నూజివీడు : పట్టణంలోని మున్సిపల్ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి జి.రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవిందు, పద్మ, ఉషారాణి, భారతి, పంగిడమ్మ, గౌరి, భారతి, గోవిందు, రాజేంద్ర, జైరామ్, గంగాధర్, చంద్రశేఖర్, ఏడుకొండలు, పృధ్వీ, గాంధీ, సుధీర్, సిఐటియు నాయకులు ఎన్ఆర్.హనుమాన్లు, జి.రాజు, పద్మజ్యోతి, రమాదేవి పాల్గొన్నారు.



గుంజీలు తీస్తూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గుంజీలు తీసి ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

20వ రోజుకు సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త సమ్మె 20వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ఉద్యోగులు గుంజీలు తీసి వినూత్నంగా తమ నిరసన తెలిపారు. సమగ్ర శిక్షఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్రపోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తాననే వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా నెలల తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆపేది లేదని తెలిపారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు వినోద్, ఝాన్సీ, భగవాన్, రాజు, రాధిక, కేశవరావు, సత్య, సందీప్, దిలీప్ పాల్గొన్నారు.

సాంప్రదాయాల పేరుతో కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్: సంక్రాంతి సందర్భంగా సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి మేరీ ప్రశాంతి హెచ్చరించారు. స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కోడిపందేలు నిర్వహిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. పేకాట, జూదం నిర్వహకులపై కఠిన చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు, కోడికత్తుల తయారీదారులు, పేకాట నిర్వాహకులపై జిల్లావ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై గట్టి నిఘా ఉంచామన్నారు. కోడిపందేలకు సంబంధించి ఎవరైనా తమ స్థలాలు, భూములిచ్చినా కఠిన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100, 112, వాట్సాప్ నెంబర్ 83329 59175కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత, గీత, మత్స్య, ఒంటరి మహిళలు, కళాకారులు, తదితర పింఛనుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి మహిళా సమాఖ్య ఏలూరు ఏరియా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని మాట్లాడుతూ వృద్ధులు తమ యావత్ జీవితాన్ని కుటుంబం, సంపద, సమాజ అభివృద్ధి కోసం, అంతిమంగా దేశ ప్రయోజనాలు కోసం తమ శక్తి సామర్థ్యాలను ధారపోసి అలసిపోయి ఉంటారన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మూడు దశాబ్దాల క్రితమే పెన్షన్ స్కీమ్ ప్రారంభించిందని ఆమె తెలిపారు. ఈ క్రమంలో ఎంపికైన పెన్షన్‌దారులు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. వృద్ధులు, వితంతువుల, చేనేత, గీత, మత్స్యకార, ఒంటరి మహిళ, కళాకారుల, తదితర పెన్షన్లు నెలకు రు.మూడు నుండి రూ.ఆరు వేలకు పెంచాలని, విభిన్న ప్రతిభావంతులు, లేక వికలాంగుల పెన్షన్ నెలకు రూ.మూడు వేలు రూ.ఏడు వేలకు పెంచాలని, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలతో కూడిన వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అర్హత కలిగి భార్యాభర్తలు జీవించి ఉంటే ఇరువురికీ పెన్షన్ సదుపాయం కల్పించాలని, 50 సంవత్సరాల నిండిన ప్రతిఒక్కరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలని, పెన్షన్ పొందుతున్న వారికి రూ.500కే గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైలు, బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని అందుకు తగిన పాసులు ఇవ్వాలని, 2007 చట్టం ప్రకారం తల్లిదండ్రుల పోషణ, వృద్ధుల సంరక్షణ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి తగు రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షురాలు కొండేటి బేబీ, కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మి ఇందిర, మాఊరి విజయ, గొర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మి పాల్గొన్నారు.

తెల్లం రాజ్యలక్ష్మి 'ఎస్‌టి' కాదు..!

పోలవరం వైసిపి అభ్యర్థి సామాజిక తరగతిపై రగడ

ఆమె తండ్రి బీసీ సామాజిక తరగతికి చెందిన వ్యక్తి అంటూ వివాదం

సమాలోచనలో వైసిపి అధిష్టానం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గ అభ్యర్థిగా చెబుతున్న తెల్లం రాజ్యలక్ష్మి గిరిజన సామాజిక తరగతికి చెందిన మహిళ కాదంటూ వివాదం నెలకొంది. దీంతో వైసిపి అధిష్టానం ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. పోలవరం ప్రస్తుతం ఎంఎల్‌ఎగా తెల్లం బాలరాజు ఉన్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న అభ్యర్థులను వైసిపి అధిష్టానం పక్కన పెట్టడం, వేరొకచోటుకు మార్చడం వంటి చర్యలకు దిగింది. ఈక్రమంలో తెల్లం బాలరాజును పక్కకు పెట్టాలని వైసిపి అధిష్టానం నిర్ణయించింది. దీంతో తన భార్య రాజ్యలక్ష్మికి ఈసారి ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వాలని బాలరాజు వైసిపి పెద్దలను కోరినట్లు తెలిసింది. దీంతో సానుకూలంగా స్పందించిన వైసిపి పెద్దలు బాలరాజు భార్య రాజ్యలక్ష్మిని నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో వచ్చేఎన్నికల్లో రాజ్యలక్ష్మి పోటీచేయనున్నట్లు వైసిపి అధిష్టానం స్పష్టత ఇచ్చినట్లయింది. ఇప్పుడు రాజ్యలక్ష్మి సామాజిక తరగతిపై వివాదం ముసురుకుంది. ఆమె తండ్రి బిసి సామాజిక తరగతికి చెందిన వ్యక్తి అని, తల్లి గిరిజన తరగతికి చెందిన వ్యక్తిగా పలువురు గిరిజన నాయకులు చెబుతున్నారు. రాజ్యలక్ష్మి తండ్రి పేరు కుక్కల సుబ్బారావు అని, ఆయన శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన వ్యక్తి అంటున్నారు. తండ్రి సామాజిక తరగతినే పిల్లలకు వర్తిస్తుందని, కాబట్టి రాజ్యలక్ష్మి ఎస్‌టి కాదంటూ చెబుతున్నారు. కానీ ఆమె గత 20 ఏళ్లుగా ఎస్‌టి కోటాలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. రాజ్యలక్ష్మి సామాజిక తరగతిపై న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయిస్తామంటూ గిరిజన నాయకులు చెబుతున్నారు. రాజ్యలక్ష్మి సామాజిక తరగతిపై వివాదం నెలకొనడంతో వైసిపి పెద్దలు ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. మరో అభ్యర్థిని బరిలోకి దింపుతారా అన్న చర్చ సైతం నడుస్తోంది. తెల్లం రాజ్యలక్ష్మి సామాజిక తరగతిని అధికారుల మరోసారి విచారణ చేసి తేల్చాల్సి ఉంది. టిడిపి తరపున టిక్కెట్ ఆశిస్తున్న బొరగం శ్రీనివాస్ సైతం ఎస్‌టి కాదంటూ మరో చర్చ సైతం తెరపైకి వచ్చింది.

ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు సాయికిరణ్ ఎంపిక

భీమడోలు : భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి దుద్దుపూడి సాయికిరణ్ ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించే పరేడ్ కార్యక్రమంలో పాల్గొనే అర్హత సాధించారని ప్రిన్సిపల్ బి.రవికుమార్, ఎన్‌సిసి అధికారి కె.శివశంకర్ తెలిపారు. సాయికిరణ్ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి యూనిట్ తరపున భీమడోలు కళాశాల క్యాడెట్‌గా చేరారు. కళాశాలకు చెందిన ఎన్‌సిసి అధికారి కె.శివశంకర్ ద్వారా శిక్షణ పొందారు. అంతకుముందు ఇదే కళాశాలకు చెందిన బి.నవీన్ సాయి 2017లో రిపబ్లిక్ డే పరేడ్‌లో ఎన్‌సిసి క్యాడెట్‌గా పాల్గొన్నారు. రిపబ్లిక్ డే పెరేడ్‌కు ఎంపికైన సాయికిరణ్‌ను ప్రిన్సిపల్‌తో పాటు ఎన్‌సిసి విభాగం అధికారి, కళాశాలకు చెందిన అధ్యాపక, అధ్యాపకేతల సిబ్బంది అభినందించారు.

చెకుముకి పోటీల్లో కైకరం విద్యార్థుల ప్రతిభ

ఉంగుటూరు : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏలూరు బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ హైస్కూలులో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి ప్రతిభా పోటీల్లో కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. నందినీ ప్రియ(10వ తరగతి), నాగసాయి పవన్ కుమార్(9వ తరగతి), ఖ్యాతి (8వ తరగతి) ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాద్‌రావు తెలియజేశారు. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ కుమార్, కునాతి జాన్, బి.సీతారాములు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమడోలు కేంద్రంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా మేనేజర్ జి.సుధాకర్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించే శిబిరంలో 30 మంది నిరుద్యోగ యువతకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత స్కిల్ హబ్ సమన్వయకర్త కె.సురేష్ బాబుకు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 13వ తేదీలోగా సమర్పించవలసి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 8184887146 ఫోన్ నెంబర్‌తో సంప్రదించాలని సూచించారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్కులైన దరఖాస్తుదారులు రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో పాటు తమ విద్యార్హతలు, ఆధార్ జిరాక్స్ కాపీలను దరఖాస్తుతో జతపర్చాలని తెలిపారు.

నూతన పింఛన్లు పంపిణీ

ఆగిరిపల్లి : భారతదేశంలోనే పెన్షన్ రూ.3 వేలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. సోమవారం ఆయన ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మండలంలో నూతనంగా మంజూరు అయిన 215 పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి పి.వీరబాబు, ఎంపిపి జి.అనూష, ఎంపిడిఒ పి.శంకరరావు, ఎం.హరిబాబు, సుజనా కుమారి, పి.నరశింహారావు, గోపినాధ్, నాగుల్ మీరా, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అభిమానులను పరామర్శించిన కేశినేని

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని సబ్ జైల్లో ఉన్న తన అభిమానులను పరామర్శించేందుకు సోమవారం విజయవాడ లోక్‌సభ ఎంపీ కేశినేని నాని నూజివీడు సబ్ జైలుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అభిమానులను రిమాండ్‌కు పంపడంతో పరామర్శించేందుకు వచ్చానని ఆయన తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో కార్యాచరణపై ప్రశ్నించిన విలేకరులతో విజయవాడలో మాట్లాడుకుందాం రండి అని ఆయన ఆహ్వానించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

చాట్రాయి : మండలంలోని చిత్తపూరు గ్రామపంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 27 మంది విద్యార్థులకు సోమవారం ట్యాబులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తిరి వీధి రమేష్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించాలని, జ్ఞానాన్ని పెంచుకోవాలని ఉద్దేశముతో ఎనిమిదో తరగతి నుంచి ట్యాబుల ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవాలని తలంపుతో రాష్ట్రంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ట్యాబులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దానిలో భాగంగానే చిత్తపూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 27 మంది విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు వెల్లంకి సుజాత, విద్యా కమిటీ ఛైర్మన్ తడికమళ్ల శిరీష, హెచ్‌ఎం దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

దళిత నేత ఆశీర్వాదం మృతి

చింతలపూడి : ప్రముఖ దళిత నాయకులు బండి ఆశీర్వాదం మధ్యాహ్నం 2 గంటలకు మృతి చెందారు. గతంలో కోఆపరేటివ్ సబ్ రిజిస్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించటమే కాకుండా అనేక దళిత ఉద్యమాల్లో పాల్గొని దళితుల హక్కుల కోసం పోరాటం చేశారు. ఆయన మృతిపట్ల ప్రముఖ దళిత సంఘాలు, మాజీమంత్రులు పితల సుజాత ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

శ్రీనివాసరావుకు మాతృవియోగం

చింతలపూడి : యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పూరేటి శ్రీనివాసరావు తల్లి చెల్లమ్మ సోమవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల యూటిఎఫ్ మండల శాఖ, పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గోపీనాధపట్నంలో 'జన భాగీదారి'

ఉంగుటూరు : గోపినాధపట్నంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద 'జన భాగీదారి' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామస్తులందరూ ప్రతిజ్ఞ చేసి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పుత్సకాయల విష్ణు మూర్తి, సచివాలయ కన్వీనర్ గంటా లక్ష్మణరావు, గ్రామ పెద్దలు గంటా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ముదినేపల్లి : మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్స్ అందజేశారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు రిటైర్డ్ హెచ్‌ఎం కీర్తిశేషులు ఎర్నేని ప్రసాద్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో సమకూర్చిన మెటీరియల్స్‌ను విద్యార్థులకు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం వై.విజయ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జి.రమేష్, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సచివాలయ అసిస్టెంట్ మృతి

మండవల్లి : లింగాల సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం మృతి చెందారు. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద 6 గంటల సమయంలో తీవ్రమైన గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. సమాచారం అందుకున్న కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు లింగాల చేరుకుని సుబ్రహ్మణ్యం పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ వీర్రాజు పరామర్శించారు.

నేరాలు - ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

మండవల్లి : గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వాడ లంకలో సోమవారం పేకాట ఆడుతున్నారని సమాచారం వచ్చిందన్నారు. దీంతో సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,200 స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం చావలపాడు గ్రామంలో కోడిపందేలు, పేకాటపై అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

జీలుగుమిల్లి : మండలంలోని తాటియాకుల గూడెం ఎస్ఇబి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి ఎస్ఇబి ఎస్ఐ క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణా నుంచి తడువాయికు ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 12 మద్యం బాటిళ్లను పట్టుకోవడం జరిగిందని ఎస్ఇబి క్రాంతి కిరణ్ తెలిపారు. మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని సోమవారం ఉదయం జంగారెడ్డిగూడెం ఎస్ఇబి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్యామ్ ఉన్నారు.

ఎస్మా ప్రయోగమా.. సిగ్గు.. సిగ్గు..!

28వ రోజుకు సమ్మె - కొనసాగిన 24 గంటల రిలే నిరాహార దీక్ష - పలుచోట్ల ఎస్మా కాపీలు దహనం, ఎర్ర చీరలతో నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె సోమవారం 28వ రోజుకు చేరింది. ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సోమవారం దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలను ఉద్దేశించి యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించడం చేతగాక వారిపై ఎస్మాను ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీలు 28 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చలనం లేనట్టు చూస్తుందని ఎద్దేవా చేశారు. యూనియన్ అధ్యక్షులు బి.రజని, యూనియన్ కార్యదర్శి దుర్గాభవాని, స్వప్న, అరుణ్ కుమారి, సిఐటియు ఏలూరు నగర అధ్యక్షులు బి.జగన్నాధ రావు పాల్గొన్నారు. మూడవరోజు దీక్షల్లో అరుణ, బి.సత్యవతి, ఎస్.రమాదేవి, బి.శ్రీదేవి, ఎస్.హేమలత, వెంకటరమణ, శ్రీలక్ష్మి, యుఎస్ కె.కుమారి, కె.ప్రసన్న 35 మంది కూర్చున్నారు.


బుట్టాయగూడెంలో ఒంటికాలుపై నిలబడి నిరసన

కొయ్యలగూడెం : మండల కేంద్రంలో అంగన్వాడీ నిరసనలు సోమవారం 28వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించటంపై సమ్మెను నీరుగార్చే ప్రయత్నంలో భాగంగా ఇలాంటి చట్టాలను ప్రయోగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు జిఒ కాపీని దగ్ధం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలపై ఆడుతున్న డ్రామా అని, ఎస్మా చట్టాన్ని ఎలా ప్రయోగిస్తారని ప్రశ్నించారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, మండల ప్రెసిడెంట్ గెల్లా గౌరీ, ముప్పిడి కనిష్ట కుమార్, కునాపం మోహన్ యాడ్లపల్లి అలెక్స్, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్న కుమారి, పి.పద్మజ, జె.నాగవేని, అడపా నాగజ్యోతి, సి.హెచ్ సునితరయల్, బొబ్బిలి చిట్టి పాల్గొన్నారు.

చింతలపూడి : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 28వ రోజు సందర్భంగా అంగన్వాడీలపై ప్రభుత్వ తీరుకు నిరసనగా నల్ల చీరలు ధరించి, నల్ల బెలూన్లు పట్టుకుని సమ్మె శిబిరం నుంచి ఎంఆర్ఒ ఆఫీస్‌కు ప్రదర్శనగా వెళ్లి స్పందన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని, జిఒ నెంబర్-2ను ఉపసంహరించుకోవాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిని స్పందన అధికారి ఎంఆర్ఒకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు ఎన్.సరళి, జి.సరళ, ఎం.పద్మ, కవిత, అరుణ, శాంతిశ్రీ, హేమలత, నాగమణి పాల్గొన్నారు.

నిడమర్రు: మండలకేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ సమ్మె 28వ రోజుకు చేరుకుంది. నిరసనగా నిడమర్రు మూడు రోడ్ల కూడలిలో అంగన్వాడీ వర్కర్స్ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ.. కొంగుచాచి బిక్షటన చేసి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె మరింత ఉధృతం అవుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమ్మెకు ఆర్.రామలక్ష్మి, ధనలక్ష్మి, నాగేశ్వరి, జయమ్మ వెంకటలక్ష్మి, సుభాషిని, వరలక్ష్మి, పార్వతి, సత్యవతి, అరుణ నాయకత్వహించారు.

భీమడోలు : భీమడోలు కేంద్రంగా అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారంతో 28వ రోజుకు చేరింది. నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అంగన్వాడీల శిబిరం వద్దకు వచ్చిన భీమడోలు సిడిపిఒ పద్మావతి మాట్లాడుతూ అంగన్వాడీలు సమ్మె విరమించి విధుల్లో చేరకుంటే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు బాధ్యత వహించవలసి వస్తుందన్నారు. ఆమె బెదిరించినప్పటికీ అంగన్వాడీలు వాటిని లెక్క చేయలేదు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో తమకు అండగా నిలిచిన సిఐటియుకు కృతజ్ఞతలు తెలిపేందుకు అంగన్వాడీలు ఎరుపు రంగు దుస్తులు ధరించి సిఐటియు అక్షరాల ఆకారంతో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం విరాళాలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు స్వర్ణ కుమారి, చల్లామణి నాయకత్వం వహించారు.


ద్వారాకాతిరుమలో జిఒ కాపీలు దగ్ధం చేస్తూ

ద్వారకా తిరుమల : మండలంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని 28వ రోజు నిరసన కార్యక్రమాలు తహశీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగాయి. అంగన్వాడీలు ఈ సందర్భంగా మెయిన్ బజార్ వెంట బిక్షాటన చేస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించిన జిఒ కాపీని తగలపెట్టి నిరసనలు తెలిపారు.

ఉంగుటూరు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం ఉంగుటూరులో అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని విమర్శించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి బి.భారతి పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో సిఐటియు ఆకారంలో ఒదిగి

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ సోమవారానికి 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలపై ఎస్మా ఎత్తివేయాలని తలకు రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సిఐటియు ఆకారంలో ఒదిగి కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయపరమైన సమస్యల పరిష్కారం పండుగ లోపు పరిష్కరించాలని లేని యెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, ఎస్తేరు, హైమ, పుష్ప పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : తమ సమస్యల పరిష్కారం కోరుతూ నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకున్నాయి. ఎస్మాను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నూజివీడు అంగన్వాడీ వర్కర్స్ యూనిట్ సెక్రటరీ రాజకుమారి మాట్లాడుతూ న్యాయమైన తమ సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ హనుమాన్లు పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం చేపట్టిన ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు తహశీల్దార్ జెవి సుబ్బారావుకు వినతిని అందజేశారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 28వ రోజుకు చేరింది. కోలాటం ఆడుతూ నిరసన తెలిపారు. యుటిఎఫ్ నాయకులు పివి సాగర్ బాబు, ఉమామహేశ్వరరావు శిబిరానికి చేరి సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు. అంగన్వాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తల న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ మండల కార్యదర్శి జి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం అంగన్వాడీ కార్యకర్తల సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరం నిర్వహణకు రూ.6వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.గంగరాజు, టి.రామాంజిబాబు, జి.లక్ష్మణరావు, బి.వాసు, జి.రాజశేఖర్, కె.కన్నబాబులు ఉన్నారు.

బుట్టాయగూడెం : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో 28వ రోజు అంగన్వాడీ కార్యకర్తలు ఎర్ర చీరలతో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్వతి, లలిత, కృపమణి, పుష్ప, మరమ్మ, సుజాత, రామలక్ష్మి పాల్గొన్నారు.

14వ రోజుకు న్యాయవాదుల నిరసన దీక్ష

ప్రజాశక్తి - నూజివీడు రూరల్


నూజివీడు పట్టణంలోని కోర్టు భవనాల వద్ద ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2023 రద్దు కోరుతూ న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా న్యాయవాదులు నరసింహారావు, రవి మధు శంకర్, డిక్సన్ మాట్లాడుతూ భూ యజమానుల హక్కును హరించే చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్య ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించండి

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆన్లైన్ చేయాలన్నారు. నిర్ణీత వ్యవధిలో ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు.

సిఆర్‌పిలకు ఆర్థిక సాయం

మండవల్లి : ఉపాధ్యాయులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విద్య కుటుంబంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఆఫీస్ సిబ్బంది, సిఆర్‌పిలకు గత నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఉపాధ్యాయులు వారిని ఆదుకునే విధంగా రూ.53 వేల ఆర్థిక సహాయాన్ని ఎంఇఒ రామారావు చేతుల మీదుగా సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య కుటుంబంలో ఒకరైన ఆఫీస్ సిబ్బంది సిఆర్‌పిలు ఇబ్బందులు పడుతున్నారని సహృదయంతో ఉపాధ్యాయులు ఆర్థిక సహాయాన్ని అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిరిగిరి పిచ్చోడు, దయానంద్ పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న రాజమణి

శ్రీసుగుణ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కలిదిండి : విజయవాడలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా స్థానిక శ్రీసుగుణ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఎం.భవాని, వి.దుర్గా భవాని, వి.నిఖిత, ఎస్.శివ దుర్గకు సంస్థ అధినేత కారి రాజమణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులు విద్యతో పాటు అన్నిరంగాలలో రాణించాలని రాజమణి అన్నారు. సచివాలయం-2 వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.మోహనరావు, రూపా, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు స్ప్రే

పోలవరం : పోలవరం మండలం కొత్త పట్టిసీమ పంచాయతీ పరిధిలో దోమలు నివారణకు దోమల మందును స్ప్రేయింగ్ చేసే కార్యక్రమం సోమవారం చేపట్టినట్లు పంచాయతీ సర్పంచి మైగాపుల విజయ దుర్గ తెలిపారు. దోమలు మందు స్ప్రేయింగ్ చేసే ప్రాంతాలను సర్పంచి స్వయంగా పరిశీలించారు. దోమల మందు పిచికారీ చేశారు.

జెడ్‌పి బాలికల హైస్కూల్లో సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని జెడ్‌పి గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో సంక్రాంతి వేడుకలను సోమవారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అందమైన రంగవల్లులు దిద్ది, గొబ్బెమ్మలను వివిధ రకాల పూలతో అలంకరించారు. భోగి మంటలు వేసి పాటలు పాడారు. పాల పొంగళ్లు వేసి, బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వివిఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి విశిష్టతను తెలుగువారి సాంస్కృతిక సాంప్రదాయాలను ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు : సంక్రాంతి పండగ మన తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం అని సిల్క్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పుల బాబురావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు సిల్క్ నగర్ ఏరియాలోని ప్రాథమిక పాఠశాలలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగల ప్రత్యేకతలను విద్యార్థులకు వివరించి సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేశారు.

ఆగిరిపల్లి : సంక్రాంతి పండుగను ఆనందంగా, సుఖ సంతోషాలతో ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. సోమవారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొని చిన్నపిల్లకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించడంతో పాటు భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరరావు, ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, జడ్‌పిటిసి వీరబాబు, ఎంపిపి అనూష, హరిబాబు, సుజన కుమారి, పి.నరశింహారావు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

10 నుంచి ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు

ప్రజాశక్తి - భీమడోలు

మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి తెలిపారు. సదరు పోటీల నిర్వహణకు ఎంపిక చేసిన క్రీడా మైదానాల సంఖ్యను రెండుకు పరిమితం చేసినట్లు చెప్పారు. దీనిలో భాగంగా భీమడోలు కేంద్రంలో క్రికెట్ పోటీలు 10, 11, 12వ తేదీల్లో, వాలీబాల్ పోటీలు 16, 17వ తేదీల్లో, కబడ్డీ పోటీలు 18వ తేదీన, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు 20వ తేదీన నిర్వహిస్తామన్నారు. గుండుగొలను కేంద్రంలో 19వ తేదీన ఖోఖో పోటీలను నిర్వహిస్తామని తెలియజేశారు. ఏమైనా అనుకోని అవంతరాలు ఏర్పడితే వాయిదా పడిన పోటీలను ఈనెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మండల స్థాయి పోటీల్లో మొత్తంగా 107 జట్లు పాల్గొంటాయన్నారు. క్రికెట్ పోటీల్లో 17 పురుషులు, ఐదు మహిళల జట్లు, వాలీబాల్ పోటీల్లో 16 పురుషులు, మూడు మహిళల జట్లు, కబడ్డీ పోటీల్లో 16 పురుషులు మూడు మహిళల జట్లు, ఖోఖో పోటీల్లో ఏడు పురుషులు, పది మహిళల జట్లు, బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో 16 పురుషులు, 15 మహిళల జట్లు పాల్గొంటారని తెలిపారు.

పోలవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ సంబంధించి గ్రామ సభ పోలవరం మండలం కొత్త పట్టిసీమ పంచాయతీలో సర్పంచి మైగాపుల విజయదుర్గ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. గ్రామ సభలో ఎన్ఆర్ఇజిఎస్‌కు సంబంధించి తనిఖీలు చేసిన పలు రకాల పనుల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్, టీ షర్టు, టోపీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వలవల వరలక్ష్మి, ఎంఇఒఎల్ చూడామణి, సెక్రటరీలు తాతి విజయ కుమారి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'కళలను ప్రోత్సహించాలి'

చింతలపూడి : కోలాటం వంటి కళలను ప్రోత్సహించాలని తపన ఫౌండేషన్ ప్రతినిధి రఘు అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో శ్రీవిష్ణు స్కూల్ ప్రాంగణంలో గత 60 రోజులుగా రేచర్ల కోలాటం గురువు సిరికొండ సుబ్బారావు ఆధ్వర్యంలో కోలాటం నేర్చుకున్న రాధాకృష్ణ కోలాటం బృందం వారి గజ్జ పూజ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తపన ఫౌండేషన్ ప్రతినిధి రఘు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పదివేల మంది కోలాటం కళాకారులను తయారు చేయాలనే ధ్యేయంతో తపన ఫౌండేషన్ పని చేస్తుందన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ముదినేపల్లి : రాష్ట్ర ప్రజలంతా జగనన్నను ఆశీర్వదించి రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వడాలిలో రూ.43.60 లక్షల నిధులతో మంజూరై నిర్మితమైన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రంను సోమవారం ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణతో కలిసి ఆయన ప్రారంభించారు.

కోడి పందేల బరులు సిద్ధం

జీలుగుమిల్లి : మండలంలోని పలుచోట్ల కోడి పందేలకు ఇప్పటి నుంచే బరుల ఏర్పాటుకు పందెం నిర్వాహకులు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి వచ్చిందంటే కోడి పందేలకు బరులు సిద్ధం అయిపోతుంటాయి. కాని మండలంలోని పలుచోట్ల పండగ వారం రోజుల ముందే కొంతమంది నేతల అండదండలతో కోడి పందేల బరులు సిద్ధం చేసేస్తున్నారు. పందెం నిర్వాహకులు ఏటా సంక్రాంతి పండుగ మొదటి రోజున ఉదయం నుంచి పోలీసుల ఆంక్షలతో పందేలకు పండుగ మూడు రోజులు మాత్రమే అనుమతులు వచ్చేవి కాని ఈ సంవత్సరం పండుగకి వారం రోజుల ముందు నుంచి బరులను సిద్ధం చేస్తుండటంతో పందెం రాయుళ్ళకు ఇక ఎదురు లేనట్లు తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ స్థానిక అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో పందెం రాయుళ్లు మాత్రం హడావిడిగా బరుల ఏర్పాటులో నిమగ్నమయ్యారు.


పందేలకు సిద్ధం చేసిన బరి